క్లుప్తంగా

ప్రజలు చైతన్యవంతులు కావాలి


ఉదిరిపికొండలో మాట్లాడుతున్న రాష్ట్ర రీసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ

కూడేరు: ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకొని చైతన్యవంతులు కావాలని అప్పుడే అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నప్పుడు ప్రశ్నించగలరని సామాజిక తనిఖీ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలో 2023–24కు సంబంధించి ఉపాధి హామీ ద్వారా రూ.7.56 కోట్లతో చేపట్టిన పనులు, సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీపై తనిఖీలు, గ్రామ సభలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదిరిపికొండ, కూడేరు, ఇప్పేరు పంచాయతీల్లో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తనిఖీల్లో బయటపడ్డ అంశాలను చదివి వినిపించారు. ఉపాధి హామీ చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచులు నాగమ్మ, లలితమ్మ, ఓబులేసు, ఏపీఓ తులసీప్రసాద్, జిల్లా రీసోర్స్ పర్సన్లు, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథలకు ఆర్డీటీ అండ


నిత్యావసరాలు అందిస్తున్న ఆర్డీటీ ఆర్డీ, ఏటీఎల్

విడపనకల్లు: ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఆర్డీటీ సంస్థ అండగా నిలిచింది. వివరాలు.. హావళిగి గ్రామంలో రెండు రోజుల కిందట భార్యాభర్తలు కోనప్పగారి మారెప్ప,లక్ష్మి ఇద్దరు కూడా ప్రమాదవశాత్తు మంటి మిద్దె కూలి దుర్మణ పాలైన సంఘటన విదితమే. బుధవారం ఆర్డీటీ ఉరవకొండ ఆర్డీ కృష్ణవేణి, ఏటీఎల్ నల్లప్పరెడ్డి మృతుల పిల్లలకు నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఘటనపై ఆర్డీ, ఏటీఎల్ విచారం వ్యక్తం చేశారు. ఆర్డీటీ సంస్థ అండగా ఉంటుందని పిల్లలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీపెద్దలు ఎగ్గడి నాగేంద్ర, చక్రవర్తి, తిమ్మప్ప, నారగాజు తదితరులు ఉన్నారు.

'డాక్టర్లపై చర్యలు తీసుకోండి'

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలోని వంశీ హాస్పిటల్ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని దళిత దండు అధ్యక్షుడు కొడవండ్ల నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గార్లదిన్నెకు చెందిన చిదంబరయ్య, వరలక్ష్మి వంశీ హాస్పిటల్ చేరారన్నారు. బాధితులకు ఆపరేషన్ అవసరం లేకపోయినా ఆరోగ్యశ్రీ కింద చేశారన్నారు. శస్త్రచికిత్స వికటించి బాధితులు శాశ్వతంగా అంధులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- ఆలయాల్లో విశేష పూజలు
- కిటకిటలాడిన వైష్ణవాలయాలు


రాయదుర్గంలో పూజలందుకున్న రుక్మిణీ పాండురంగస్వామి


వేపులపర్తిలో పూజలందుకున్న లక్ష్మీరంగనాథస్వామి


ఉరవకొండ: విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి


కణేకల్లులో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాండురంగస్వామికి తెల్లవారుజామున వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకం నిర్వహించి పుష్పాలంకరణ, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఠల విఠల... రుక్మిణీ పాండురంగ విఠల అంటూ భక్తులు స్వామికి భజనలు చేపట్టారు. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు తులసీ మాలాధారణ చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. బొమ్మనహాళ్ పాండురంగస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం, విష్ణు సహస్రనామావళి, కుంకుమార్చన చేపట్టారు. భక్తులు అఖండ భజన నిర్వహించారు. సాయంత్రం స్వామి పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు హాజరై తొలి ఏకాదశి పూజలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ద్వాదశిని పురస్కరించుకుని గురువారం ఉదయం 8 గంటలకు పాండురంగస్వామి రథోత్సవం జరుగుతుందని, భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని దేవస్థానం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కేబీ మురళి, రాజశేఖర్ కోరారు.

బ్రహ్మసముద్రం: వేపులపర్తి గ్రామంలో స్వయంబుగా వెలసిన లక్ష్మీ రంగనాథ స్వామి ఆలయం, సంతే కొండాపురంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల్లో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉరవకొండ: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలోని పురాతన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, మహమంగళహరతి, కుంకుమార్చన చేపట్టారు. అనంతరం గంధాభిషేకం, తులసీ అర్చన, విష్ణు సహస్రనామావళి పారాయణం నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

కణేకల్లు: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొలిఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, నిర్మాల్య విసర్జన, అభిషేకం, పంచామృతాభిషేకం, స్వామి వారి అలంకరణ, తులసీ అర్చన, నైవేద్యం, మహామంగళారతి తదితర పూజలు నిర్వహించారు.

బెళుగుప్ప: బూదిగుమ్మ పద్మావతి వెంకటరమణ స్వామి, ఆంజనేయస్వామి ఆలయం, బెళుగుప్పలోని రామేశ్వరస్వామి, వెంకటరమణస్వామి, షిర్డీసాయి, విఘ్నేశ్వరస్వామి, మంజునాథస్వామి ఆలయం, శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి, నక్కలపల్లి షిర్డీ సాయినాథుని ఆలయాల్లో బుధవారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ఉంతకల్లులో పాండురంగస్వామిని దర్శించుకొంటున్న భక్తులు, ఉంతకల్లులో పాండురంగస్వామి తులసీ మాలను స్వీకరిస్తున్న భక్తులు


ఉరవకొండ: లక్ష్మీవేంకటేశ్వరాలయానికి తరలివచ్చిన భక్తులు

జైనబ్బీ ఉరుసు జయప్రదం చేయండి


ఫ్లెక్సీ విడుదల చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

ఉరవకొండ: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన పాక్‌దామన్ హజ్రత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసును జయప్రదం చేయాలని ముస్లిం పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు కోరారు. బుధవారం స్థానిక దర్గా వద్ద ఉరుసుకు సంబంధించిన ఫ్లెక్సీ విడుదల చేశారు. ముందుగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 28 నుంచి 30 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, అసోసియేట్ అధ్యక్షుడు పామిడి జాకీర్, ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్, కార్యదర్శి జీఎంఎస్ షాకీర్, గౌరవ సలహాదారు మోకానిక్ అబ్దుల్ రహిమాన్, సహాయకార్యదర్శి ఖాదర్ బాషా, కోశాధికారి జెండాజిలాన్, టీమ్ మేనేజర్ బళ్లారి సాదిక్ , బొంబాయి సెట్‌మైను, కణేకల్లు యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా సాహిత్య విస్తృత ప్రచారమే లక్ష్యం

అనంతపురం కల్చరల్: మహాకవి జాషువా సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించడమే లక్ష్యమని పలువురు వక్తలన్నారు. గుర్రం జాషువా జయంతి ఉత్సవాల పోస్టర్లను బుధవారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాషువా సాహిత్య పీఠం నిర్వాహకులు నాగలింగయ్య, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న మాట్లాడుతూ ఈనెల 24న మహాకవి జాషువా జయంతి వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న జాషువా విగ్రహానికి జిల్లాలోని ప్రముఖులతో పుష్పాలంకరణ జరుగుతుందన్నారు. 11 గంటలకు జాషువా సాహిత్యంపై ఆర్ట్స్ కళాశాలలో సదస్సు జరుగుతుందని తెలిపారు.

ఏకలవ్యుని స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగాలి



చిన్నారులకు నోట్ పుస్తకాలను అందిస్తున్న ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత, ఉరవకొండలో ఏకలవ్యుడి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న ఎరుకల సేవా సంఘం నాయకులు

కళ్యాణదుర్గం: ఎరుకల ఆరాధ్య దైవం ఏకలవ్యుని స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మంచి చదువులు చదువుతూ ఉన్నతంగా ఎదగాలని ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత సూచించారు. ఉప్పొంక గ్రామంలో బుధవారం ఏకలవ్యుని జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్టీలకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. అనంతరం స్థానిక చిన్నారులు, యువకులతో కలిసి కేకు కత్తిరించి స్వీట్లు పంచిపెట్టారు. కాలనీలో చదువుకుంటున్న చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈడీటీ వెంకటేశులు, సబ్ డివిజినల్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మోహన్, రాష్ట్ర ఎస్టీ నాయకులు కావాడి గోవిందరాజులు, చంద్ర, కిష్టప్ప, రాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి..

ఉరవకొండ: ఎరుకల ఆరాధ్య దైవం ఏకలవ్యుడి జయంతిని బుధవారం ఏపీ ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి ఏకలవ్యుడి చిత్రపటంతో క్లాక్‌టవర్ వద్దకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏకలవ్యుడి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్, నియోజకవర్గ అధ్యక్షుడు సాకే వసంత్ మాట్లాడుతూ ఎరుకలు రాజకీయ, సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సేవాసంఘం ప్రధాన కార్యదర్శి సాకే పురుషోత్తం, మహీంద్రా, గంగన్న, సుబ్బరాయుడు, నరసింహులు, వీరేష్, ఆంజనేయులు, శేషాద్రి, వీరేంద్ర, సోమశేఖర్, సుధాకర్, హనమంతు, ఎర్రిస్వామి, జలందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎండుముఖం పట్టిన పంటలు


కూడేరు సమీపంలో ఎండుముఖం పట్టిన వేరుశనగ

కూడేరు: మండలంలో ముందస్తున్న సాగు చేసిన పంటలు వర్షం లేక ఎండుముఖం పట్టారు. జూన్ మాసంలో ఓ మోస్తరుగా వర్షాలు కురిశాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు ముందుస్తుగాసుమారు 1000 ఎకరాల్లో వేరుశనగ, సుమారు 700 ఎకరాల్లో ఆముదం , 200 ఎకరాల్లో కంది సాగు చేశారు. విత్తనం విత్తిన తర్వాత దాదాపుగా ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో నేలలో తేమ లేక సాగు చేసిన పంటలు ఎండ ముఖం పట్టాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మేఘాలు నల్లగా మారి ఊరిస్తున్నాయి తప్ప చినుకులు నేల రాలడం లేదు. వర్షం వస్తే సుమారు 20 వేల ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీకగా లాలుస్వామి పీర్లు


ఆమిద్యాలలో శంఖు, చక్రాలతో కొలువుదీరిన లాలుస్వామిపీర్లు


ఉద్దేహాళ్‌లో గుండం చుట్టూ తిరుగుతున్న పీర్లు


కూడేరు: జలధికి వెళ్తున్న పీర్లు


బ్రహ్మసముద్రం : వేపులపర్తిలో పీర్ల స్వాములను గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఆమిద్యాల గ్రామంలో వెలసిన లాలుస్వామి పీర్లు మతసామరస్యాన్ని చాటుతున్నాయి. మొహర్రం వేడుకల్లో లాలుస్వామి పీర్లు మహావిష్ణువుకు చెందిన శంఖు, చక్రాలతో దర్శనం ఇవ్వడం విశేషం. బుధవారం స్వామి వారి జలధి కార్యక్రమంలో భాగంగా భక్తులు పెద్ద ఎత్తున లాలుస్వామి పీర్లను తిలకించడానికి తరలివచ్చారు. రెండేళ్ల నుంచి ఇక్కడ గ్రామస్తులు శంఖు, చక్రాలతో కొలువుదీర్చి మతసామరస్యాన్ని చాటుతున్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు..

బొమ్మనహాళ్: మొహర్రం వేడుకల్లు బుధవారం ఉద్దేహాళ్, , లింగదహాళ్, శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, గోవిందవాడ, కల్‌హోళ, కానాపురం, కురువల్లి, చంద్రగిరి, కొత్తూరు తదితర గ్రామాల్లో ఘనంగా ముగిశాయి. పీర్లను రంగురంగుల దుస్తులు, పూలతో అందంగా అలంకరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. యువకులు, భక్తులు పీర్ల ఎదుట ఉత్సాహంగా చిందులు వేశారు. గ్రామస్తులు అగ్నిగుండం చుట్టు అలావు తొక్కారు. సాయంత్రం వందలాది మంది భక్తుల నడుమ పీర్లను జలధికి తరలించారు. చుట్టు పక్కన గ్రామాలు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో జలధి..

కూడేరు: మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం మండలంలో పీర్ల దేవుళ్ల జలధి మహోత్సవాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండుగకు బంధుమిత్రులను ఆహ్వానించడంతో ఆయా గ్రామాలు జనసంద్రమయ్యాయి. వేకువ జామున పీర్లదేవుళ్లు అగ్ని గుండ ప్రవేశం చేశారు. సాయంత్రం జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో పీర్ల చావిళ్ల వద్దకు వెళ్లి పీర్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు డప్పుల నడుమ చిందులు తొక్కారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

బెళుగుప్ప: కోనంపల్లి, విరుపాపల్లి, ఎర్రగుడి, యలగలవంక, రామసాగరం, శీర్పి, కాలువపల్లి, జీడిపల్లి గ్రామాల్లోని బుధవారం తెల్లవారుజామున పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. సాయంత్రం భక్తజనసందోహం మధ్య జలధి కార్యక్రమాలు కొనసాగాయి.

బ్రహ్మసముద్రం: బ్రహ్మసముద్రం , భైరసముద్రం, వేపులపర్తి, కోనాపురం, పిల్లలపల్లి, ఎరడికెర తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా యువత డప్పు వాయిద్యాల నడుమ గుండం చుట్టూ అలావ్ తొక్కారు. సాయంత్రం పీర్లను అగ్ని గుండం ప్రవేశం చేయించి జలధికి తరలించారు.

కంబదూరు: మండల కేంద్రంతో పాటు కొత్తూరు, రాళ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారం ముగిసాయి. సాయంత్రం ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించి జలధికి తీసుకెళ్లారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలో బుధవారం మొహర్రం వేడుకలు ముగిశాయి. భక్తులు బుధవారం ఉపవాసాలతో చక్కెర చదివించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను జలధికి తీసుకెళ్లారు.

రాయదుర్గంటౌన్: మొహర్రం వేడుకలు పట్టణంలో వైభవంగా ముగిశాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక ఫాతేహా పటించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను పూలమాలలు, వస్త్రాలతో అలంకరించి ఊరువాకిలి వద్ద ఊరేగించారు. పీర్ల ఊరేగింపుకు కులమతాలకు అతీతంగా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కోట వీధులు కిక్కిరిశాయి. ఉచ్చుబాయి, చమ్మా పీర్ల మకాన్‌లో వెలసిన పీర్లు, ఆత్మకూరు వీధిలోని నింబూసా పీర్ల మకాన్, లడ్డు పీర్ల మకాన్, గౌందిబావి పీర్ల చావిడి(పెద్దమకాన్), కోట తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లను ఇక్కడికి తీసుకొచ్చి ఊరువాకిలి పీర్ల చావిడి వద్ద పూజలు చేయించడం ఆనవాయితీ. ఉచ్చుబాయి పీర్ల కొండపైకి వెళ్లి వచ్చే కార్యక్రమం వైభవంగా జరిగింది. పురవీధుల్లో ఊరేగింపు అనంతరం పీర్లను తప్పెట్లు, తాశాలతో జలధికి తరలించారు.

కణేకల్లు: కణేకల్లు, ఎన్.హనుమాపురం, మాల్యం, తుంబిగనూరు, గరుడచేడు, సొల్లాపురం తదితర గ్రామాల్లో బుధవారం పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. కణేకల్లులోని కొత్తకొట్టాల, ఎన్.హనుమాపురంలోని లాలుస్వామి పీర్ల ఊరేగింపు వైభవంగా జరిగింది. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రధానవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం పీర్లను జలధికి తీసుకెళ్లారు.

గుమ్మఘట్ట: బేలోడు, నేత్రపల్లి, భూపసముద్రం, తాళ్లకెర, కేపీదొడ్డి గ్రామాల్లో బుధవారం పీర్లను మేళతాళాలతో ఊరేగించారు. యువకులు అగ్నిగుండం చుట్టూ అలావ్ తొక్కారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

ఉరవకొండ: మండల వ్యాప్తంగా పీర్ల జలధి బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో లాలుస్వామిపీర్లను దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్థానిక బీబీ జైనబ్బీ దర్గా ఆవరణలో మండల వ్యాప్తంగా తరలివచ్చిన పీర్లు ఒకే చోట సమూహంగా చేరి ప్రత్యేక ప్రార్థనల అనంతరం జలధికి తరలించారు.

విడపనకల్లు: పాల్తూరు,గడేకల్లు, ఉండబండ, చీకలగురికి, గాజుల మల్లాపురం, విడపనకల్లు, డొనేకల్లు, వి.కొత్తకోట, ఆర్.కొట్టాల, పాలికి, హంచనహాల్‌లో బుధవారం పీర్ల జలధి జరిగింది. డప్పు వాయిద్యాల నడుమ పీర్లను ఊరేగించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

వజ్రకరూరు: మండల వ్యాప్తంగా బుధవారం పీర్ల ఊరేగింపు వైభవంగా జరిగింది. స్థానిక లాలుస్వామి, కటికెల స్వామి, తల్లి పీరా, హుసేన్, ఇమామ్ఖాసీమ్ తదితర పీర్ల చావిళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.


రాయదుర్గంలోని కోటలో ఊరేగుతున్న పీర్లు


ఉరవకొండలో జలధి కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు


కణేకల్లులోని కొత్తకొట్టాలలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


కంబదూరు: కొత్తూరులో జలధికి వెళ్తున్న పీర్లు


కళ్యాణదుర్గంలో జలధికి వెళ్తున్న పీర్లు


గుమ్మఘట్ట: భూపసముద్రంలో జలధికి తరలిపోతున్న పీర్లు


ఉంబండలో పీర్ల ఊరేగింపు